ఈనాడు
పార్వతీపురం మన్యం
బుధవారం అక్టోబరు 16, 2024

ఇన్‌ఛార్జి మంత్రిగా అచ్చెన్నాయుడు

ఈనాడు-విజయనగరం, పార్వతీపురం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం జిల్లాలకు ఇన్‌ఛార్జి మంత్రులను నియమించింది. పార్వతీపురం మన్యం జిల్లాకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. డా.బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా బాధ్యతలు కూడా ఆయనే చూడనున్నారు. విజయనగరం జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన గుమ్మిడి సంధ్యారాణి అల్లూరి సీతారామరాజు జిల్లాలకు ఇన్‌ఛార్జులుగా ఉంటారు.

ఆదివాసీల అభ్యున్నతికి కృషి


కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: మన్యంలోని ఆదివాసీల అభ్యున్నతికి కృషి చేస్తామని ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. మండలంలోని చింతమానుగూడలో గిరిజన కళాక్షేత్రం, మినీ మ్యూజియం ప్రారంభించారు. పీవో మాట్లాడుతూ.. గిరిజన సంస్కృతి పరిరక్షణ, జానపద కళల ప్రోత్సాహకానికి తోడ్పాటు అందిస్తామన్నారు. అనంతరం మంత్రజోల గ్రామంలోని వికాస కేంద్రాన్ని పరిశీలించి బిస్కెట్ల తయారీ యూనిట్ ప్రారంభించారు.


మూలికలు తిలకిస్తున్న పీవో

అశేష జనవాహిని.. వేలాది ఘటాలు.. మేళతాళాలు.. వేదపండితుల మంత్రోచ్చరణలు.. భక్తుల జయజయ ధ్వానాలు, విచిత్ర వేషధారణల నడుమ సిరులతల్లి.. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి.. విజయనగరం పైడితల్లి సిరిమాను సంబరం మంగళవారం కనుల పండువగా సాగింది. తల్లి ప్రతిరూపంగా ఉన్న సిరిమాను పూజారిని ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి వచ్చిన భక్తులు కనులారా చూసి పునీతులయ్యారు.

– ఈనాడు, విజయనగరం, న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్, కంటోన్మెంట్, మయూరికూడలి, ఉడాకాలనీ, పట్టణం, గ్రామీణం, రింగురోడ్డు, కోట

సిరిమానుపై ఇలవేల్పు వైభోగం


పుష్పాలంకరణలో పైడితల్లి



పైడిమాంబ ఉత్సవాల్లో కీలక ఘట్టమైన సిరిమానోత్సవంలో భాగంగా వేకువజామున అమ్మవారికి పంచామృతాభిషేకాలు, పూజలు చేశారు. ఉదయం నుంచి భక్తులు దర్శనానికి బారులు తీరారు. తొలుత హుకుంపేటలోని సిరిమానును దర్శించి.. అనంతరం చదురుగుడికి చేరారు. లక్షలాది మందితో క్యూలైన్లు కిటకిటలాడాయి. మధ్యాహ్నం పూజారి బంటుపల్లి వెంకటరావు తల్లి ప్రతిరూపంగా సిరిమానును అధిరోహించారు.


అశేష జనవాహిని నడుమ సిరిమాను ఊరేగింపు, పైన పూజారి వెంకటరావు

పట్టు వస్త్రాల సమర్పణ: రాష్ట్ర పండగ కావడంతో ప్రభుత్వం తరపున మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సతీసమేతంగా పట్టువస్త్రాలు సమర్పించారు. అంతకు ముందు పూసపాటి వంశీయులు, దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు, సతీమణి సునీలా గజపతిరాజు, కుమార్తె, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, కుటుంబ సభ్యులు పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు చేశారు.

త్వరగా ముగిసిన సంబరం: దాదాపు పుష్కర కాలం తర్వాత చీకటి పడక ముందే సాయంత్రం 5.30 గంటల్లోగా ఉత్సవాన్ని ముగించారు. విజయనగరం ఎస్పీ వకుల్ జిందాల్ కంట్రోల్ రూమ్ నుంచే పర్యవేక్షించారు. ఊరేగింపులో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ అంబేడ్కర్ పాల్గొని రథాలను నడిపించారు.


దర్శనానికి కుటుంబంతో వచ్చిన కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రధాన రథం ముందు కదిలిన బెస్తవారి వల, ఏనుగు రథం, అంజలి రథం, చేప ఆకృతితో కూడిన వల, పాలధార తదితరాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

హాజరైన ప్రముఖులు : మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయికళ్యాణ్ చక్రవర్తి, ఎమ్మెల్యేలు జయకృష్ణ, విజయచంద్ర, కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, పండగ ప్రత్యేక అధికారి, సింహాచలం ఈవో వి.త్రినాథరావు, మాన్సాస్ ఈవో ప్రసాద్, దేవస్థానం ఈవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సంధ్యారాణికి పూర్ణకుంభంతో స్వాగతం

అమ్మ పండగ.. ఆనందం మెండుగా

● భక్తులతో కిక్కిరిసిన నగరం


పైడిమాంబ దర్శనానికి క్యూలైన్లలో బారులుదీరిన భక్తులు




కోట సమీపంలో సిరిమానోత్సవాన్ని తిలకిస్తున్న భక్తజనం


కుటుంబ సభ్యులతో దర్శనానికి వెళుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కళ్యాణ్ చక్రవర్తి




రఘురామ కృష్ణం రాజు

బేబినాయన


ఉత్సవాన్ని తిలకించేందుకు కోట పైకి వెళుతున్న అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే నాగమాధవి తదితరులు


నమస్కరిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

పైడితల్లి జాతర నేపథ్యంలో మంగళవారం ఉదయం నుంచి నగరం కిక్కిరిసింది. పోలీసులు అధికారికంగా ఎనిమిది ప్రాంతాల్లో వాహనాల రాకపోకలను నిషేధించారు. వివిధ చోట్ల పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు. భక్తులు కాలినడకనే తల్లి దర్శనానికి వెళ్లారు. వీరికి యంత్రాంగంతో పాటు దాతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సేవలు అందించారు.

- న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్, మయూరికూడలి, ఉడాకాలనీ, పట్టణం, గ్రామీణం, కంటోన్మెంట్, కోట, రింగురోడ్డు


సినీనటుడు సుహాస్, హీరోయిన్ సంగీర్తన

విత్తనాల అందజేత..

సోమవారం అర్ధరాత్రి తరువాత దేవస్థానం అధికారులు, హుకుంపేట వాసులు, తలయారీలు చదురుగుడి నుంచి కోట వరకు ఘటాలతో వెళ్లారు. అక్కడ కోటదుర్గకు మొక్కి.. జిల్లా, రాష్ట్రం, దేశం బాగుండాలని పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి తిరిగి చదురుగుడికి వచ్చారు. ఆలయ ప్రాంగణంలో సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు రైతులకు విత్తనాలు అందజేశారు. ఇదే తొలేళ్ల ఉత్సవంలో ప్రధాన ఘట్టం.





భక్తుల సందడి

ఉత్సవాలు విజయవంతం: కలెక్టర్

విజయనగర ఉత్సవాలు, అమ్మవారి సిరిమానోత్సవం విజయవంతంగా నిర్వహించామని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. భక్తులకు ఇబ్బంది లేకుండా అనుకున్న సమయానికే ఊరేగింపు పూర్తి చేయగలిగామన్నారు. నిర్వహణ కోసం సుమారు నెలరోజులుగా సమావేశాలు నిర్వహించి, వివిధ వర్గాలతో చర్చించామన్నారు. 12 వేదికల్లో నిర్వహించిన సాంస్కృతిక, సాహిత్య, వినోద కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయని చెప్పారు. సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.


ఊరేగింపులో పాల్గొన్న కలెక్టర్లు అంబేడ్కర్, శ్యామ్‌ప్రసాద్, ఆర్డీవో దాట్ల కీర్తి తదితరులు


బందోబస్తును పరిశీలిస్తున్న ఐజీ ప్రతాప్, ఎస్పీ తదితరులు


సిరిమాను పూజారితో దేవదాయ అధికారులు


మంత్రులు శ్రీనివాస్, సంధ్యారాణి, ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యేలు అదితి, విజయచంద్ర



రథాలే ఆకర్షణ

సిరిమాను ముందు కదులుతున్న అంజలి రథం, బెస్తవారి వల, ఏనుగు రథం, పాలధార









చెరువులో పడి దర్జీ మృతి

పార్వతీపురం గ్రామీణం, బెలగాం, న్యూస్‌టుడే: చెరువులో పడి ఓ వృద్ధుడు మృత్యువాత పడిన ఘటన పార్వతీపురం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై దినకర్ వివరాల మేరకు.. అడ్డాపుశీల గ్రామానికి చెందిన బి.వెంకటరమణ(68) టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈయనకు భార్య, ముగ్గురు కుమారులున్నారు. మంగళవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు స్థానికంగా ఉన్న చెరువుకు వెళ్లారు. ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందారు. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులు, పోలీసులకు తెలియజేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


వెంకటరమణ (పాతచిత్రం)

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం


తగరపువలస (విశాఖపట్నం), న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ కాపలాదారు మృతి చెందినట్లు భీమిలి ఎస్సై హరీష్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం విజయనగరం జిల్లా గంట్యాడ మండలం కొటారుబిల్లికి చెందిన డి.శ్రీను(40) భీమిలి అప్పికొండదిబ్బలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. దసరా నేపథ్యంలో భార్య రమణమ్మ, కుమారులు దీపక్, సందీప్, తండ్రి సూరితో కలిసి ఈనెల 13న విజయవాడ కనకదుర్గ దర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో 14వ తేదీ రాత్రి తగరపువలసలోని గోస్తనీ కూడలి వద్ద బస్సు దిగారు. కుటుంబ సభ్యులతో కలిసి రోడ్డు దాటుతుండగా విశాఖ నుంచి విజయనగరం వైపు వేగంగా వెళుతున్న ఓ కారు శ్రీనును ఢీకొనడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.


డి.శ్రీను (పాతచిత్రం)

గుర్ల, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన గుర్ల మండలం ఆనందపురం వద్ద చోటు చేసుకుంది. ఎస్సై మోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరానికి చెందిన ఆర్.రాజు (40) సోమవారం సాయంత్రం ద్విచక్రవాహనంపై గరివిడి నుంచి విజయనగరం వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో రాజు ఘటనాస్థలిలోనే మృతిచెందాడు. మంగళవారం శవపంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో 15 ఎకరాల చెరకు తోట దగ్ధం

రేగిడి, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో 15 ఎకరాల మేర చెరకు తోటలు దగ్ధమైన ఘటన మంగళవారం రేగిడి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక రైతు దేవకోటి బాబ్జిరావు పొలం గుండా విద్యుత్తు తీగలు వెళుతున్నాయి. షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. చెరకు తోటలకు అంటుకోవడంతో పెద్దఎత్తున విస్తరించాయి. ఎస్.జగన్నాథంనాయుడు, ఎ.మల్లయ్య, కె.భాస్కరరావు, డి.భాస్కరరావు, డి.వెంకటరమణ, డి.శ్రీను, ఎల్.రఘురాం, ఆర్.గోవిందరావు, ఎల్.విష్ణు, కె.గోవింద్, కె.అప్పలనాయుడు తదితర రైతులకు చెందిన తోటలు కాలిపోయాయి. పాలకొండ అగ్నిమాపక అధికారి సరోజ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. రూ.13.50 లక్షల నష్టం జరిగినట్లు అంచనా వేశారు. రెవెన్యూ, విద్యుత్తు శాఖ అధికారులు ఘటనాస్థలిని పరిశీలించారు. క్షేత్రస్థాయి అధికారుల వివరాలు సేకరించారు. బాధితులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే కోండ్రు దృష్టికి తీసుకెళ్లి, న్యాయం చేయాలని కోరారు.



చోరీ కేసులో ఏడాది జైలు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: ఓ రైతు అప్పు తీరుద్దామని బ్యాంకు నుంచి నగదు డ్రా చేసి ఇంటికి తిరిగి వస్తుండగా ఆ సొమ్ము కాజేశాడు ఓ వ్యక్తి. సదరు నిందితుడికి ఏడాది కఠిన కారాగార శిక్ష విధిస్తూ కృష్ణా జిల్లా గన్నవరం 8వ అదనపు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు మంగళవారం తీర్పునిచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. గన్నవరం మండలం గోపవరపుగూడెంకు చెందిన ఎం.వెంకటసుబ్బారావు వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. గతంలో తీసుకున్న అప్పు తీరుద్దామని విశాఖకు చెందిన ఓ మిత్రుడి వద్ద రూ.3 లక్షల నగదు అడగగా అతడు బ్యాంకు ఖాతాలో జమ చేశాడు. గన్నవరంలోని బ్యాంకుకు వెళ్లి డ్రా చేసి ద్విచక్ర వాహనానికి పక్కన ఉన్న పెట్టెలో భద్రపరిచి తిరుగు పయనమయ్యారు. మార్గమధ్యలో ఓ ఎరువుల దుకాణం వద్ద కాసేపు ఆగి వెంటనే ఇంటికి బయలుదేరారు. వెనుక వైపు నుంచి పెట్టె శబ్దం రాగా.. గ్రామ శివారుకు చేరుకొనే సమయంలో ఆగి చూశారు. అప్పటికే నగదు మాయమైంది. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడిగా విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన ఎం.తిరుపతిగా గుర్తించారు. కోర్టులో నేరం రుజువు కావడంతో ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పు వచ్చినట్లు పోలీసులు, ఏపీపీ టి.మాధవి తెలిపారు.

పోక్సో కేసు నిందితుడి పరారీ?

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: అత్యాచారం కేసులో నిందితుడిగా ఉన్న ఓ యువకుడు పోలీసుల కళ్లు కప్పి పరారైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక పార్వతీపురం పట్టణంలో చదువుతోంది. సదరు విద్యార్థినికి మాయమాటలు చెప్పి అదే గ్రామానికి చెందిన యువకుడు అత్యాచారానికి పాల్పడినట్లు గ్రామీణ స్టేషన్‌లో బాధితురాలి తల్లి ఫిర్యాదు చేశారు. దీనిలో భాగంగా బాలికకు జిల్లా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. విచారణకు స్టేషన్‌కు తీసుకురాగా అక్కడి నుంచి మంగళవారం పరారైనట్లు తెలుస్తోంది. అతడి కోసం కొందరు సిబ్బంది గాలిస్తున్నట్లు సమాచారం. దీనిపై గ్రామీణ ఎస్సై దినకర్ వద్ద ప్రస్తావించగా.. ఓ యువకుడిని ఠాణాకు తీసుకొచ్చామని, ఇంటికి వెళ్లి వస్తానని చెప్పాడని తెలిపారు.

స్త్రీనిధి రుణాల లక్ష్యం రూ.55 కోట్లు

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: మహిళల స్వయం ఉపాధికి అనుగుణంగా యూనిట్ల ఏర్పాటుకు రూ.55 కోట్లు స్త్రీనిధి రుణాలు ఇవ్వనున్నట్లు జిల్లా సహాయ జనరల్ మేనేజర్ హేమలత తెలిపారు. గుమ్మలక్ష్మీపురంలోని వెలుగు కార్యాలయంలో మంగళవారం సిబ్బందితో సమావేశమయ్యారు. మొత్తం 11 వేల మంది సభ్యులకు రుణాలు ఇస్తామన్నారు. ఇప్పటివరకు 4 వేల మందికి రూ.23 కోట్లు ఇచ్చినట్లు చెప్పారు. ఏపీఎం ఆదయ్య, సీసీలు ఉన్నారు.


సూచనలు చేస్తున్న ఏజీఎం

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	142	254	264

మద్యం విధానంపై మాట్లాడే హక్కు వైకాపాకు లేదు: కళా


మాట్లాడుతున్న వెంకటరావు, చిత్రంలో బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన

బొబ్బిలి, న్యూస్‌టుడే: మద్యం విధానంపై మాట్లాడే హక్కు వైకాపా అధినేత జగన్, ఆ పార్టీ నేతలకు లేదని ఎమ్మెల్యే కళా వెంకటరావు మండిపడ్డారు. మంగళవారం బొబ్బిలిలో తెదేపా సీనియర్ నేత అల్లాడ భాస్కరరావు స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్పిరిట్ తయారీ కర్మాగారాలను జగన్ స్వాధీనం చేసుకుని.. పంపిణీదారులుగా ప్రభుత్వం వ్యవహరించడంతో ఇష్టారాజ్యంగా మద్యం వ్యాపారం సాగించారని విమర్శించారు. జే బ్రాండ్ మద్యంతో ప్రజల ఆరోగ్యాలను పాడుచేశారని ఆరోపించారు. విశాఖలో ప్రత్యేకంగా మానసిక రోగులు ఆసుపత్రి ఉండగా.. కేజీహెచ్‌లో కూడా మరో వార్డును ఏర్పాటు చేశారంటే అయిదేళ్లు సరఫరా చేసిన మద్యం ఎలా ఉందో తెలుస్తోందన్నారు. 500 దుకాణాలకు దరఖాస్తులు పెట్టుకున్న వారికి ఒక్కటి కూడా దక్కలేదంటే లాటరీ ఎంత పారదర్శకంగా జరిగిందో అర్థం చేసుకోవచ్చన్నారు. వర్షాకాలం వల్ల కొన్ని రేవుల్లో ఇసుక తవ్వకాలు జరగడం లేదని, పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అనంతరం నియోజకవర్గానికి చెందిన పలువురు సీనియర్ నేతలను కళాకు బేబినాయన పరిచయం చేశారు.

అంతర్జాతీయ పోటీల్లో పైడిరాజుకు కాంస్యం

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సాలూరు మండలం మామిడిపల్లికి చెందిన కనకల పైడిరాజు అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో కాంస్యం పతకం సాధించింది. మలేసియాలో జరిగిన 800 మీటర్ల విభాగంలో మూడో స్థానంలో నిలిచినట్లు మామిడిపల్లి ఉన్నత పాఠశాల పీడీ శ్రీరాములు మంగళవారం తెలిపారు. గతంలో ఆమె శ్రీలంకలో జరిగిన పోటీల్లో రజతం దక్కించుకుందని చెప్పారు. మరోసారి అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించడంతో గ్రామస్థులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు.



గరుగుబిల్లికి జంఝావతి నీరు


ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: గరుగుబిల్లి మండలానికి నాలుగు రోజుల్లో జంఝావతి కాలువ నుంచి సాగు నీరు తీసుకొచ్చేలా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే జగదీశ్వరి పేర్కొన్నారు. ఉల్లిభద్ర వద్ద ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తి చేయిస్తామన్నారు. తెదేపా మండలాధ్యక్షుడు ఎ. మధుసూదనరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత వైకాపా ప్రభుత్వ పాలనలో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టు భూములకు సాగునీరు అందడం లేదన్నారు. శివ్వాంలో రూ.3 లక్షలతో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నాయకులు డి.సత్యనారాయణనాయుడు, ఎ.తవిటినాయుడు, కె.భరత్, శంకరరావు, పి.పూర్ణచంద్రరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి కృషి


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం గ్రామీణం, సీతానగరం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బి.విజయచంద్ర పేర్కొన్నారు. వెంకటరాయుడుపేట, బాలగుడబ రహదారి నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేశారు. సీతానగరం మండలంలోని నిడగల్లులో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సర్పంచులు సావిత్రి, అరుద్రమ్మ, ఉప ఎంపీపీ సూర్యనారాయణ, నాయకులు జీవీ.నాయుడు, చంటి, చంద్రమౌళి, ఎం.చిరంజీవి, డీఈఈ సత్యనారాయణ, ఎంపీడీవో రూసేన్, ఏపీఎం కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పవిత్రోత్సవాలు


వెంకటేశ్వరునికి పూజలు


నాగావళి ఒడ్డున ఉత్సవ మూర్తులకు శ్రీచక్రస్నానం చేస్తున్న అర్చకులు

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: తోటపల్లి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్వామి ఉత్సవ విగ్రహాలను నాగావళి ఒడ్డున ఊరేగింపుగా తీసుకువెళ్లి శ్రీచక్రస్నానం చేయించారు. నదీ జలాలను భక్తులపై చల్లి అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు. తొలుత ప్రధాన అర్చకులు వి.వి.అప్పలాచార్యులు సుప్రభాత సేవ, బాలభోగం, చూర్ణోత్సవం, స్నపనం కార్యక్రమాలు నిర్వహించారు. మన్యం, విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశాకు చెందిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

? ఇటీవల పలు గ్రామాల్లో అతిసారం ప్రబలుతోంది. బబ్బిడిలో రక్షిత పథకం క్లోరినేషన్ చేయించాలి. - **స్థానికులు**

❖ పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా క్లోరినేషన్ చేయిస్తాం. - **రామకృష్ణ, కార్యదర్శి**
– న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం

? గుచ్చిమి పంచాయతీ పరిధిలోని శివారు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి పూట ఇబ్బంది పడుతున్నాం. - **రామకృష్ణ**

❖ పరిశీలించి కొత్త దీపాలు అమర్చుతాం. - **ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి**
– న్యూస్‌టుడే, సీతానగరం

? జియ్యమ్మవలస ప్రధాన రహదారిపై మురుగు పారుతోంది. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. - **స్థానికులు**

❖ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం. - **ఎస్.రమేష్, ఎంపీడీవో**
– న్యూస్‌టుడే, జియ్యమ్మవలస

? పాలకొండ యాతవీధిలో బోరు పనిచేయడం లేదు. - **లక్ష్మి, గృహిణి**

❖ మరమ్మతులు చేపట్టి వినియోగంలోనికి తీసుకొస్తాం. - **దేవీవరప్రసాద్, ఏఈ**
– న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

? బలిజిపేట నుంచి చిలకలపల్లికి వెళ్లే రహదారిలో ఏడు చోట్ల మలుపులు ఉన్నాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. - **గోవిందరావు, యాదవవీధి**

❖ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. - **బి.జయరాజు, ర.భ.శాఖ జేఈ**
– న్యూస్‌టుడే, బలిజిపేట

పల్లె ప్రగతికి..

సంపద కేంద్రాల పూర్తికి కార్యాచరణ

ప్రభుత్వం పునరుజ్జీవం

వీరఘట్టం, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి గతంలో తెదేపా ప్రభుత్వం చెత్త నుంచి సంపద తయారీకి అధిక ప్రాధాన్యమిచ్చింది. అన్ని పంచాయతీల్లో ఈ కేంద్రాల నిర్మాణానికి చర్యలు తీసుకుంది. వీధుల్లో సేకరించిన తడి, పొడి చెత్తతో ఆర్థిక వనరులు సమకూర్చింది. తడి చెత్తతో సేంద్రియ ఎరువుల తయారీకి ప్రాధాన్యం ఇస్తూ.. పొడి చెత్తను అమ్మకాలు చేపట్టే వినూత్న కార్యక్రమం పల్లెలకు పరిచయం చేసింది. దీంతో గ్రామాల్లో పరిశుభ్రతతో పాటు ఉపాధికి అవకాశం దొరికింది. కానీ.. గత వైకాపా పాలనలో ఈ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. అధికారులు కనీస చొరవ తీసుకోకపోవడంతో వీధుల్లో సేకరించిన చెత్త ఆరుబయట పారబోస్తున్నారు. దీంతో పరిసరాలు అపరిశుభ్రంతో పాటు పర్యావరణానికి విఘాతం కలుగుతోంది.

నిర్మాణాలకు నిధులు..

తెదేపా హయాంలో పెండింగ్‌లో ఉన్న సంపద కేంద్రాల పనులను వైకాపా కొనసాగించలేదు. దీంతో గత అయిదేళ్లలో అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పనులు పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేస్తూ కూటమి ప్రభుత్వం పునరుజ్జీవం పోసేందుకు కార్యాచరణ చేపట్టేందుకు సన్నాహాలు చేస్తుంది. వీరఘట్టం మండలంలో 34 పంచాయతీల్లో 16 సంపద కేంద్రాలు ఉన్నాయి. ఆరు పంచాయతీల్లో షెడ్లు నిర్మాణ దశలో ఉండగా.. మిగిలినవన్నీ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.


పిల్లర్ల దశలో నిలిచిపోయిన చెత్త సేకరణ కేంద్రం నిర్మాణం


కత్తులకవిటిలో నిరుపయోగంగా సంపద కేంద్రం

పంచాయతీలకు ఆదాయం..

సంపద కేంద్రాల నిర్మాణంతో పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుంది. ప్రభుత్వం కూడా ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారిస్తోంది. వానపాముల ఎరువు తయారు చేసి రైతులకు విక్రయించడానికి ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. వీటితో వచ్చిన ఆదాయంతో పర్యావరణ కార్మికులకు వేతనాలు సమకూరుతాయి. వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యానశాఖల ద్వారా వానపాము ఎరువు ఉపయోగంపై అవగాహన కల్పిస్తే ఆశించిన ఫలితాలు దక్కుతాయి.

పరిసరాల పరిశుభ్రత వైపు..

ప్రస్తుతం గ్రామాల్లో ఇంటింటా సేకరించిన చెత్తను రహదారుల పక్కన, చెరువులు, నదీ తీర ప్రాంతాల్లో పారబోస్తున్నారు. ఆరుబయట పారబోసిన చెత్తకు నిప్పంటించడంతో అటుగా రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు పరిసరాలు కలుషితమవడంతో చుట్టుపక్కల వారి ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. సంపద కేంద్రాలు వినియోగంతో భవిష్యత్తులో కాలుష్యం నుంచి ఇబ్బందులు తప్పుతాయి.

నిర్మాణాలు వేగవంతం చేస్తాం..

సంపద కేంద్రాలు వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వ ప్రత్యేక చొరవ తీసుకొంది. మండలంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన, ప్రారంభానికి నోచుకోని చెత్త సేకరణ కేంద్రాల నిర్మాణాలను పూర్తి చేయడానికి, ప్రజలకు వీటి ఆవశ్యకతపై అవగాహన కృస్తున్నాం. – **జి.సత్యంనాయుడు, ఏపీవో, ఉపాధి హామీ, వీరఘట్టం**

ఉద్యోగాలకు 46 మంది ఎంపిక


మేళాలో పాల్గొన్న అభ్యర్థులు

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: యువతకు ఉపాధి కల్పనే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికృష్ణ చైతన్య అన్నారు. మంగళవారం సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించారు. హెటిరో డ్రగ్స్, టీమ్ లీజ్, భారత్‌పే ప్రతినిధులు హాజరయ్యారు. 165 మంది అభ్యర్థులు పాల్గొనగా 46 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు సాయికృష్ణ చైతన్య తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి.శ్రీను, జేకేసీ సమన్వయకర్త ఎ.రాంబాబు, ఏపీఎస్‌ఎస్‌డీసీ సిబ్బంది హాజరయ్యారు.

సేవలు క్రమబద్ధీకరించాలని నిరసన

కురుపాం గ్రామీణం, సీతానగరం: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ పలువురు అధ్యాపకులు కురుపాంలో నిరసన తెలిపారు. 2019లో వైకాపా ప్రభుత్వం హామీ ఇచ్చి మొండి చేయి చూపిందన్నారు. కూటమి ప్రభుత్వమైనా తమ కుటుంబాల్లో వెలుగులు నింపాలని కోరారు. ❖ సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు పసుపు రిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు.


కురుపాంలో పసుపు రిబ్బన్లు ధరించిన అధ్యాపకులు


దస్త్రాలు పరిశీలిస్తున్న జేసీ శోభిక

పక్కాగా భూముల వివరాల నమోదు

సీతానగరం, న్యూస్‌టుడే: భూముల రీసర్వే వివరాలు పరిశీలన పక్కాగా చేపట్టాలని సంయుక్త కలెక్టరు శోభిక రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని వెన్నెల బుచ్చింపేటలో జరిగిన గ్రామసభలో పాల్గొన్నారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సభలు నిర్వహించి పాత, కొత్త పాసు పుస్తకాలు పరిశీలించి, తేడాలు ఉంటే సరి చేయాలని సిబ్బందికి సూచించారు. తహసీల్దారు ప్రసన్నకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఒత్తిడి అధిగమిస్తే మంచి ఫలితాలు

పాలకొండ, న్యూస్‌టుడే: నిత్య జీవితంలో ఒత్తిడిని అధిగమిస్తేనే మంచి ఫలితాలు సాధించొచ్చని జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం బృంద సభ్యుడు కె.కృష్ణారావు పేర్కొన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పాలకొండ ప్రాంతీయ సుపత్రిలో సిబ్బందికి అవగాహన కల్పించారు. విధుల్లో ఒత్తిడికి దూరంగా ఉండాలని, రోజూ కనీస వ్యాయామం చేయాలన్నారు. ఆసుపత్రి పర్యవేక్షకుడు జి.నాగభూషణరావు, ఆర్ఎంవో కె.చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేలో తప్పులపై సదస్సు

కొమరాడ, న్యూస్‌టుడే: భూముల రీసర్వేలో జరిగిన తప్పులు సరి చేస్తామని ఇన్‌ఛార్జి తహసీల్దార్ శివయ్య తెలిపారు. మంగళవారం సివిని గ్రామస్థులతో మాట్లాడారు. హక్కుదారు పేరు స్థానంలో పాఠశాల పేరుందని, రామాలయానికి చెందిన భూమి వేరే విధంగా నమోదైందని, ఒక రైతుకు బదులు మరో రైతు పేరున సర్వే నంబర్లు నమోదు చేశారని గ్రామస్థులు తెలియజేశారు.

పరిశుభ్రతతో డెంగీ దూరం

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతో డెంగీని అరికట్టవచ్చని జిల్లా మలేరియా సహాయ అధికారి సూర్యనారాయణ పేర్కొన్నారు. కురుపాంలో ఇటీవల డెంగీ బారిన పడిన వారిని జిల్లా కన్సల్టెంట్ రామచంద్రతో కలిసి పరిశీలించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల ఆవరణలో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. కేసుల వివరాలు ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలన్నారు. వైద్యసిబ్బంది కె.రాధాకృష్ణ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంపై ఫిర్యాదు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సీతంపేటలో 46వ నంబరు మద్యం దుకాణాన్ని లాటరీలో దక్కించుకున్న మహిళ స్థానికేతురాలని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్‌కు వలగెడ్డకు చెందిన హెచ్.ప్రసాద్, ఎస్.బాలరాజు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈమె పాలకొండలో నివాసం ఉంటున్నారని, గతంలో వాలంటీరుగా పనిచేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిబంధనల మేరకు గిరిజనులకు మాత్రమే దుకాణాలు కేటాయించాల్సి ఉందని తెలిపారు.

పోతుల గెడ్డ.. రూపు మారుతోంది

పాలకొండ పట్టణంలోని పోతులగెడ్డ నుంచి వరద నీరు అన్నవరం సమీపంలోని నాగావళికి వెళ్లాలి. కానీ ఆక్రమణలు, పూడికతో గెడ్డ పిల్ల కాలువలా మారింది. దీంతో నీరు ప్రవహించడం లేదు. భారీ వర్షాలు కురిస్తే లోతట్టు ప్రాంతాలైన గారమ్మకాలనీ, కస్పావీధి, కాపువీధులు నీట మునుగుతున్నాయి. పూడిక తొలగించి కాలువను మెరుగు పరుస్తామని కమిషనరు ఎస్.సర్వేశ్వరరావు తెలిపారు. – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం



రసాబడికి వెళ్లేదెలా..?



గుమ్మలక్ష్మీపురం మండలంలోని గొయిపాక నుంచి రసాబడికి ఉన్న మట్టి దారి వర్షాకాలంలో బురదగా మారుతోంది. అత్యవసర సమయాల్లో 108 కూడా గ్రామంలోకి రావడం లేదు. అధికారులు స్పందించి రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై ఎమ్మెల్యే జగదీశ్వరి వద్ద ప్రస్తావించగా.. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి చర్యలు చేపడతామని తెలిపారు.
– న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం

నెల రోజులుగా.. మూలనే!

పాలకొండ పట్టణంలో చెత్త సేకరణ కోసం అధికారులు రూ.48 లక్షలతో కాంపాక్టు వాహనం కొనుగోలు చేశారు. నెల రోజులు గడుస్తున్నా వినియోగంలోకి తీసుకురాలేదు. ప్రస్తుతం ఉన్న వాహనం ఎప్పటికప్పుడు మరమ్మతులకు గురవడంతో సకాలంలో చెత్త తరలించడం సాధ్యం కావడంలేదు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తికానందున వినియోగంలోకి తీసుకురాలేదని కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు తెలిపారు. – **న్యూస్‌టుడే, పాలకొండ**



ఎందుకు నిర్మించారో.. ఏమో..?


నిరుపయోగంగా వదిలేసిన గోదాము

భామిని, న్యూస్‌టుడే: భామిని మండల కేంద్రంలో సుమారు రూ.కోటి నిధులతో గత తెదేపా హయాంలో నిర్మించిన గోదాము ఇప్పటికీ నిరుపయోగంగా వదిలేశారు. నెలవారీ రేషన్ బియ్యం, సరకులు 1000 టన్నుల వరకు నిల్వ చేసుకునేలా నిర్మించారు. దీంతోపాటు సిబ్బంది కార్యాలయం, వేబ్రిడ్జి ఏర్పాటు చేశారు. వీటిని కూడా పట్టించుకోకుండా వదిలేశారు. దీంతో రేషన్ సరకులు 45 కి.మీ దూరంలోని సీతంపేట గోదాము నుంచి సరఫరా చేస్తున్నారు. ఆ భారం ప్రభుత్వంపైనే పడుతోంది. ఇక్కడ వేబ్రిడ్జిని అందుబాటులోకి తీసుకురావాలని పత్తి, మొక్కజొన్న రైతులు కోరుతున్నారు. విషయం డీఎస్‌డీటీ మధుసూదనరావు వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి గోదాము, వేబ్రిడ్జి ప్రారంభించేలా చర్యలు చేపడతామన్నారు.

వేప కషాయం పంటలకు ఔషధం


కషాయం తయారు చేయిస్తున్న ఏవో సౌజన్య

వీరఘట్టం, న్యూస్‌టుడే: పంటలకు వేప కషాయం ఔషధమని ఏవో సౌజన్య తెలిపారు. వీరఘట్టంలో కూరగాయల రైతులతో కషాయం తయారు చేయించారు. చీడ, పీడలు సోకవని, నాణ్యమైన దిగుబడులు వస్తాయని తెలిపారు. ● జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం, బలిజపేట గ్రామీణం: జియ్యమ్మవలసలో తెగుళ్లు, కీటకాల నివారణపై ఏవో టి.జ్యోత్స్న, కేవీకే ఎస్ఎంఎస్ వై.ఉమాజ్యోతి అవగాహన కల్పించారు. ● గుమ్మలక్ష్మీపురంలో ఏవో ప్రసాద్, బలిజిపేట మండలంలోని బర్లిలో ఏవో ఏవో శ్రావణ్‌కుమార్, సర్పంచి అప్పలనాయుడు రైతులకు సూచనలు చేశారు. ● సాలూరు గ్రామీణం, పాచిపెంట: విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సాలూరు ఏడీ మధుసూదన్‌రావు తెలిపారు. పాంచాలి, తాడూరులో పొలం పిలుస్తోంది నిర్వహించారు. విత్తనాలు, పురుగుల మందులు కొనుగోలు చేసే రైతులు రసీదు తీసుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ఉపాధ్యాయులతో ఎంపికైన విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం: కొత్తగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు జితేంద్ర, చరణ్, అభి, చందు, అఖిల్, చంద్రదేవ్ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. హెచ్ఎం నాగరాజు, పీడీ మాధవరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

స్మార్ట్ మీటర్ల రద్దుకు ధర్నా

సీతంపేట: విద్యుత్తు ఛార్జీలు తగ్గించి, ప్రజలపై భారం పెంచే స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని ఈ నెల 18న అన్ని విద్యుత్తు ఉప కేంద్రాల వద్ద ధర్నా చేపడతామని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.వేణు తెలిపారు.

సిటు జిల్లా సమావేశాలు

పాలకొండ: పాలకొండలో ఈ నెల 19, 20 తేదీల్లో సిటు జిల్లా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సంఘాధ్యక్షుడు రమణారావు తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలపై చర్చిస్తామని చెప్పారు.

విద్యా సామగ్రి వితరణ

కొమరాడ: విద్యార్థులు పరీక్షల్లో రాణించాలని ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ అన్నారు. మాదలింగి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ పరీక్షకు వెళ్లే విద్యార్థులకు సామగ్రి అందజేశారు. హెచ్ఎం నాగేశ్వరరావు ఉన్నారు.

అవగాహన సదస్సు

సీతంపేట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో ఎస్సై అమ్మన్నరావు పోక్సో చట్టం, సైబర్ నేరాలు, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

దేశమ్మ సంబరాలు

పార్వతీపురం పురపాలక: పట్టణంలోని రైతులు రాయగడ రోడ్డు శివారులో, పద్మశ్రీ సినిమా హాలు వద్ద దేశమ్మ తల్లికి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. చీర, గాజులు సమర్పించి మొక్కులు చెల్లించారు. బొగ్గులు, బుగత, గొర్లి వీధుల్లో ఘటాలు ఊరేగించారు.

పనులకు శంకుస్థాపన

బలిజిపేట: చిలకలపల్లిలో వాటర్ హార్వెస్టింగ్ పనులకు జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్ శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో విజయలక్ష్మి, ఏపీవో కేశవరావు, ఈవోపీఆర్డీ పుష్పనాథం, ఇంజినీరింగు అధికారి అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు జీవనోపాధులు కల్పించాలి

పార్వతీపురం, న్యూస్‌టుడే: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని గిరిజనులకు ఉపాధి కల్పించి జీవన ప్రమాణాలు మెరుగు పర్చాలని అధికారులను ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. స్థానిక వనరుల విలువ పెంచేందుకు అవసరమైన శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఐటీడీఏ, గిరిజన సంక్షేమ, పరిశ్రమల శాఖల అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరుకు వినతి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రమీల

సాలూరు గ్రామీణం, పాచిపెంట, న్యూస్‌టుడే: గ్రామసభల నిర్వహణ, పనులకు ప్రతిపాదనలు చేసినపుడు తమకు తెలియజేయాలని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు కోరారు. పాచిపెంటలో ఎంపీపీ బి.ప్రమీల అధ్యక్షతన మంగళవారం మండల సమావేశం నిర్వహించారు. పారమ్మకొండపై విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలని పణుకువలస సర్పంచి సీతారాం, కొటికిపెంటలో నిర్వాసితులకు ఇళ్లు మంజూరు చేయాలని సర్పంచి అప్పలనాయుడు కోరారు. వీటిపై తీర్మానం చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎంపీడీవో పాత్రో, ఏఈ సింహాచలం తెలిపారు. జడ్పీ ఉపాధ్యక్షుడు సింహాచలం, ఉప ఎంపీపీ ఎం.నారాయణ, తహసీల్దార్ రవి పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితం నాశనం

సీతానగరం: మాదక ద్రవ్యాల వినియోగంతో జీవితాలు నాశనం అవుతాయని ఎస్ఐ రాజేష్ అన్నారు. నిడగల్లు ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం మనోజ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సంక్షోభంలో వ్యవసాయ రంగం


మాట్లాడుతున్న సూర్యనారాయణ

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: దేశంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో పడిందని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ అన్నారు. రైతు సమస్యలపై మంగళవారం పార్వతీపురంలో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వాలు పంటలకు మద్దతు ధరలు కల్పించలేక పోతున్నాయన్నారు. పంట నష్టపోయిన వారికి సహకారం అందడం లేదన్నారు. నవంబరు 10 జిల్లా స్థాయి సదస్సు నిర్వహిస్తామన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి, ఆర్.లక్ష్మినాయుడు, జి.సత్యనారాయణ, రాము తదితరులు పాల్గొన్నారు.

మహాసభ విజయవంతానికి పిలుపు

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఏఐఎస్ఎఫ్ (అఖిల భారత విద్యార్థి సమాఖ్య) నిరంతరం పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ అన్నారు. మంగళవారం పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద గోడప్రతులు విడుదల చేశారు. విద్యార్థులకు వసతి సౌకర్యం, కాస్మోటిక్ ఛార్జీల పెంపు, మౌలిక సదుపాయాల కల్పన, ఉపకార వేతనాలు అందజేయాలన్నారు. జిల్లాలో త్వరలో జరగనున్న ప్రథమ మహాసభ విజయవంతం చేయాలని కోరారు. పలువురు విద్యార్థులు కోరారు.


గోడప్రతులు ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

అబ్దుల్‌కలాం అందరికీ ఆదర్శం


నివాళులర్పిస్తున్న ఎంపీడీవో వెంకటరమణ, కార్యదర్శులు

బలిజిపేట గ్రామీణం, పార్వతీపురం గ్రామీణం, వీరఘట్టం, న్యూస్‌టుడే: పెదపెంకిలో భారతరత్న, మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం జయంతిని నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవినాయుడు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ❖ పార్వతీపురం మండలంలోని తేలునాయుడువలసలో హెచ్‌సీ కృష్ణమూర్తి విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, వృద్ధులకు దుస్తులు అందజేశారు. ❖ వీరఘట్టం మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో బి.వెంకటరమణ, ఉద్యోగులు నివాళులర్పించారు.